# వామ్మో ఎర్రకుంట రోడ్డు!

**గుంతలమయమైన రహదారి**

- రోడ్డుపైనే పారుతున్న మురుగు, వర్షం నీరు
- ఐదు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట సమయం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- తరచూ ప్రమాదాలు
- ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు స్పందించాలని వినతి



షాహిన్‌నగర్‌లో ధ్వంసమైన రోడ్డు

**పహాడీషరీఫ్:** ఎర్రకుంట నుంచి పహాడీషరీఫ్ వెళ్లే ప్రధాన రహదారి తరచూ దెబ్బతింటుండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం, శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే రోడ్డు కావడంతో ఈ రూట్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై మురుగునీరు పారుతుండటంతో గోతులమయమైంది. షాహిన్‌నగర్‌లోని హుడా స్కూల్ సమీపంలో బస్తీల నుంచి వస్తున్న మురుగునీటితో పాటు పక్కనే ఉన్న గుట్టల నుంచి వర్షపు నీరు జాలు పారుతోంది. హైవే హోటల్ సమీపంలో వరద నీరు పారి ఇసుక పేరుకుపోయింది. ఇసుక మేటలపై నీరు నిలిచి, గోతులు ఏర్పడ్డాయి. ఇక ఎర్రకుంటలోని ఎస్‌జే గార్డెన్ సమీపంలోనూ మురుగునీటి ప్రవాహంతో గుంతలు ఏర్పడ్డాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. పాడైన రహదారికి మరమ్మతులు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ముందుకురాకపోవడం వాహనదారులకు శాపంగా మారింది.

**చీకటి పడితే ట్రాఫిక్**

- ఈమార్గంలో పగటి పూట నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు చీకటి పడిందంటే స్తంభించి పోతున్నాయి.
- అసలే ఇరుకుగా ఉన్న ఎర్రకుంట రహదారిపై గోతుల కారణంగా వాహనదారులు అవస్థలు పడుతున్నారు.
- ముఖ్యంగా అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.
- రోడ్డుపై గోతులు పడడం, ఐదారు ప్రమాదాలు జరిగిన తర్వాత మరమ్మతులు చేపట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది.
- పహాడీషరీఫ్ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేలా కాల్వలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.
- షాహిన్‌నగర్ నుంచి పహాడీషరీఫ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలంటున్నారు.

**ప్రమాదాలు నిత్యకృత్యం**

- గోతులమయంగా మారిన ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- గత ఆదివారం ఉదయం తన బంధువుతో కలిసి షాహిన్‌నగర్ నుంచి చాంద్రాయణగుట్ట వైపు వెళ్తున్న ఈదిబజార్‌కు చెందిన సయ్యద్ జకీ అనే యువకుడు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.
- ఎర్రకుంట బారా మజ్లీస్ నుంచి మర్రి చెట్టు వరకు ప్రమాదాల తీవ్రత అధికమవుతోంది.
- పహాడీషరీఫ్ నుంచి ఎర్రకుంటకు ఐదారు కిలోమీటర్ల దూరం ప్రయాణానికి రాత్రి పూట అరగంట సమయం పడుతోంది.
- ఈ సమస్య కారణంగా కల్వకుర్తి, ఆమనగల్లు నుంచి నగరానికి వెళ్లే వాహనదారులు చాలా వరకు ఆర్జీఐ రూట్‌ను ఎంచుకుంటున్నారు.


**డివైడర్ నిర్మించాలి**



ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుని ప్రజలు, వాహనదారుల సమస్యను పరిష్కరించాలి. రహదారికి ఇరువైపులా వరద, మురుగు నీరు వెళ్లేలా కాల్వలు నిర్మించాలి. ఎర్రకుంటలో కిలోమీటర్ మేర డివైడర్ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ యూటర్న్ తీసుకుంటున్నారు. ఇది ప్రమాదాలకు కారణమవుతోంది.
– సయ్యద్ హుస్సేన్, వాదే ముస్తఫా

## క్లుప్తంగా

### సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేకలంకరణలో అమ్మవారు

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. ఆలయం ప్రాగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ గాయత్రీహిల్స్ కాలనీలో మంగళవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి విచ్చేసి పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు పూర్తిచేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారును ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, జిల్ల రమేశ్‌గౌడ్, గిరిముదిరాజ్, ఇక్కె శ్రీనివాస్, కాలనీవాసులు ఉన్నారు.

### శుభాకాంక్షలు



వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఈరంకి విశ్వనాథ్‌గౌడ్

**పహాడీషరీఫ్:** బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌కు బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలందరూ పని చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండె వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్ కార్మికుల జీతాలలో భారీకోత

**వనస్థలిపురం:** వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వారికి రావాల్సిన జీతంలో సదరు ఏజెన్సీ కోత విధిస్తుండడంతో చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో టీవీటీ గ్రూప్ స్ప్రెడింగ్ ఇంటిగ్రిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ, ఆయాలు, వార్డ్‌బాయ్‌లు మొత్తం 58 మంది కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నారు. రికార్డుల ప్రకారం వారికి నెలకు రూ. 15,600 జీతం ఇస్తున్నట్లుగా చూపించి వారికి కేవలం నెలకు రూ. 10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. అయితే పీఎఫ్ కింద రూ. 500 మాత్రమే జమ చేస్తూ మిగతావి సదరు సంస్థ నొక్కేస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై గత ఐదేళ్లుగా యూనియన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని కార్మికులు వాపోతున్నారు. జీతాలలో కోత విషయమై కాంట్రాక్ట్ కార్మికులు తమకు పలుమార్లు ఫిర్యాదు చేసిన మాట నిజమే. ఆ విషయం మా చేతుల్లో లేదని సూపరింటెండెంట్ కృష్ణ తెలిపారు.

### నీటి బిల్లు రద్దుకు వినతి

**ఎల్‌బీనగర్:** నూతన భవనాలకు అధికంగా నీటి బిల్లులను వేస్తు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు కీసరి నర్సిరెడ్డి అన్నారు.హయత్‌నగర్ శ్రీనివాస్ కాలనీలో నూతన భవనాలకు రూ. 600 నుంచి రూ.2 వేల వరకు నీటి బిల్లులు వేస్తున్నరని వాటిని వెంటనే అరికట్టాలని మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో జలమండలి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నీటి బిల్లులతో వినియోగదారులపై అధికభారం పడుతుందని, మీటర్లను సరిచేసి తక్కువ బిల్లులను వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

**పహాడీషరీఫ్:** మామిడిపల్లిలోని ప్రాచీనమైన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పాలక మండలి చైర్మన్ కల్లెం నరేశ్‌గౌడ్ అన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఆరురోజుల పాటు జరుగనున్న ఉత్సవాల దృష్ట్యా ఆలయ పరిసరాలలో చదును పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనుల పండువగా జరిగే ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు పార్కింగ్ సదుపాయం కోసం ఆలయ పరిసరాలను జేసీబీ, డోజర్‌తో చదును చేయిస్తున్నామన్నారు. ఆలయం ఎదుట ఉన్న కొబ్బరి చెట్ల కొమ్మలను కూడా తొలగిస్తున్నామన్నారు. కమిటీ డైరెక్టర్లు చీమలదరి చెన్నయ్య, గొండ్యాల శేఖర్‌ముదిరాజ్, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, ఏ.అనిత, భక్తులందరి సహకారంతో ఈ సారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాల్ సతీష్‌గౌడ్, లాల్ విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చదును పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నరేశ్‌గౌడ్, నాయకులు

## పాఠశాలలో టీఎల్ఎం మేళా



లేమూరులో ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈఓ నర్సింహ, ఉపాధ్యాయులు

**కందుకూరు:** మండల పరిధిలోని లేమూరు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం టీఎల్ఎం మేళాను నిర్వహించారు. విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా అర్థవంతమైన అభ్యాసాన్ని కలిగించేలా రూపొందించిన గణితం, సైన్స్, తెలుగు, ఆంగ్ల భాషలు తదితర విభాగాలకు సంబంధించిన వినూత్న ఆవిష్కరణలను ఉపాధ్యాయులు ప్రదర్శించారు. వాటిని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నర్సింహ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సృజనాత్మకతను అభినందించారు. ఇటువంటి మేళాలు విద్యార్థుల్లో లోతైన అభ్యాసాన్ని వెలికితీయడానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అంజయ్య, రాములు, గ్రామపెద్దలు రాణాప్రతాప్ రెడ్డి, శ్రీధర్, జైపాల్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి సన్మానం



బాలాపూర్ పోలీసు సిబ్బందిని సన్మానిస్తున్న గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు

**బడంగ్‌పేట్:** బాలాపూర్ గణేశ్ ఉత్సవాల్లో ప్రతిష్ట బందోబస్త్ నిర్వహించి శాంతియుతంగా శోభాయాత్ర పూర్తి చేసేందుకు సహకారం అందించిన పోలీసు సిబ్బందిని మంగళవారం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. గణేశ్ ఉత్సవ సమితి తరఫున ఏసీపీ జానకీరెడ్డి, డీసీపీ సత్యనారాయణ, బాలాపూర్ సీఐ సుధాకార్, ఎస్ఐ సుధాకర్, ప్రసాద్, కోటేశ్వర్‌రావు, సోహెల్‌తో పాటు బాలాపూర్ పోలీసులు, పహాడిషరీఫ్ పోలీస్ సిబ్బందిని శాలువాలతో సన్మానించి గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**బడంగ్‌పేట్:** నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి గౌరవ అధ్యక్షుడు ప్రొ.వి.బాలకృష్ణారెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ డీఆర్డీఓ చీఫ్ కంట్రోలర్, ఆకాశ్ క్షిపని సృష్టికర్త డాక్టర్ ప్రహ్లాద రామారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డిగ్రీ పట్టాను, ఉత్తమ విద్యార్థులకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ.కె.శశికాంత్, ఎంవీఎస్ఆర్ కళాశాల చైర్మన్ పీవీఆర్ కాశ్యాప్, సెక్రటరీ డా.కేపీ శ్రీనివాస్‌రావు, ట్రెజరర్ సుధాకర్ జుపుడి, జాయింట్ సెక్రటరీ సూర్య ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వర్‌రావు, సీపీ వర్థిని, డీన్‌లు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





విద్యార్థులకు డిగ్రీ పట్టా అందిస్తున్న అతిథులు

### నిమజ్జన వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

**మన్సూరాబాద్:** మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులోని వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము వరకు గణనాథుల నిమజ్జనం కొనసాగడంతో రెండు రోజుల అనంతరం గణనాథులను తొలగించి కొలనును శుభ్రం చేస్తున్నారు. రానున్న బతుకమ్మ ఉత్సవాలకు కొలనును సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## కుళ్లిన పులిహోర ప్రసాదం కలకలం

**చంపాపేట:** చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ప్రసిద్ధిచెందిన ధ్యానాంజనేయ స్వామివారి ఆలయంలో వీఐపీ భక్తులకు అందించే కుళ్లిన పులిహోర ప్రసాదం కలకలం రేపింది. మంగళవారం స్థానిక భక్తుడు స్వామివారిని దర్శించుకుని పూజారులు అందించిన వీఐపీ ప్రసాదాన్ని తీసుకున్నాడు. ఆతను పులిహోర పాకెట్‌ను విప్పిన వెంటనే కుళ్లిన వాసన రావడంతో ఆ విషయాన్ని ఆలయ పాలక మండలి సభ్యుల దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని ఆరా తీశారు. ఈ క్రమంలో ఇరువురి నడుమ మధ్య స్వల్ప వాగ్వాదం చోటుకొంది. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కలకలం రేపింది. ఈ విషయమై ఈఓ లావణ్యను వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని కుళ్లిన ప్రసాద విషయమై ఆలయ అధికారుల దృష్టికి తీసుకుని రాలేదని ఆ ప్రసాదాన్ని తమకు అందచేసినట్లైతే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు పంపించే వారమన్నారు. తాము ప్రసాదాన్ని ఏ రోజుకు ఆరోజే పంపిణీ చేస్తామన్నారు. తాను విధులలోకి చేరిన వెంటనే పూర్తిస్థాయి విచారణ చేసి బాధులపై చర్యలు తీసుకుంటానన్నారు.



కుళ్లిన పులిహోర ప్రసాదం

## కాళోజీ నారాయణరావుకు నివాళి



నేదునూరులో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తుక్కుగూడ: మున్సిపల్ కార్యాలయంలో..

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయమోహన్‌రెడ్డి, గ్లోరీ, కృష్ణ, కరుణాకర్, శ్రీవాణి, పీడీ అబ్దుల్లా, కౌసల్య, గిరిజ, సిబ్బంది హసినుద్దీన్, ఎండీ సర్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాకవి కాళోజీ**

**తుక్కుగూడ:** ప్రజాకవి కాళోజీ జయంతిని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, అధికారులు, పుర సిబ్బంది పాల్గొన్నారు.





కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**బడంగ్‌పేట్:** బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామానుజారెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, చైతన్యకుమార్, కృష్ణాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ సభ్యుల నియామకానికి ఆహ్వానం

**తుక్కుగూడ:** మున్సిపల్ పరిధిలోని జెన్నాయిగూడ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయ పాలక మండలి సభ్యుల నియామకానికి దేవాదాయ ధర్మదాయ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 10 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### చెత్త రిక్షాల అందజేత

**మన్సూరాబాద్:** ప్రజారోగ్యమే ధ్యేయంగా పరిసరాల పరిశుభ్రతకు చెత్త రిక్షాలను అందజేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి కాస్మోపాలిటన్‌కాలనీలో మంగళవారం జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి చెత్త రిక్షాలను అందజేసి మాట్లాడారు. స్వచ్ఛ భారత్–స్వచ్ఛ హైదారబాద్ లక్ష్యాన్ని నెరవేర్చే క్రమంలో సిబ్బందికి అవసరమైన పరికరాలు, వనరులు అందించాలన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**మన్సూరాబాద్:** వచ్చేనెల 12న పద్మశాలి దసరా మేళాను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత పద్మశాలి అన్నసత్రాల మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్ అన్నారు. పద్మశాలి దసరా మేళాపోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. 22 ఏళ్లుగా పద్మశాలి దసరా మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. త్వరలో కొత్తపేటలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్‌నేత, రవితేజ, గుజ్జసత్యం, సంధ్యారాణి, శ్రావణ్, అంజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

## కీమోథెరపీ యూనిట్ ప్రారంభం

**వనస్థలిపురం:** రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం వర్చువల్‌గా అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డేకేర్ కీమోథెరపీ యూనిట్లను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా పరిధి వనస్థలిపురంలోని మహేశ్వరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణ పది పడకల కీమోథెరపీ, అదనంగా పది పడకల పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధితులు మొదట నగరంలోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకుని చికిత్స తర్వాత, రెండవసారి నుంచి స్థానికంగా ఉన్న ఆసుపత్రులలో కీమోథెరపీ సేవలు పొందవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి 266 మంది క్యాన్సర్ రోగులను వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి అలాట్‌మెంట్ చేయడం జరిగిందని అలాగే పక్షవాతం రోగులకు పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్స నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డా.జయమాల, డా.రాజ్‌కుమార్, జనరల్ సర్జరీ, అనస్థీషియా, మెడికల్, నర్సింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



కీమోథెరపీ యూనిట్ ప్రారంభోత్సవంలో వైద్యులు

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

**మన్సూరాబాద్:** పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ మహిళా విభాగం నూతన కార్యవర్గం సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అధ్యక్షతన మన్సూరాబాద్‌లోని పాలాది పరమేశ్వర్ వృద్ధాశ్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్, గ్రేటర్ హైదాబాద్ సంఘం అధ్యక్షురాలు పోరండ్ల శారద హాజరై నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావటమే కాకుండా రాజకీయంగా ఎదుగేందుకు కృషి చేయాలన్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా రమాదేవి, గౌరవ అధ్యక్షురాలిగా భారతమ్మ, గౌరవ సలహాదారులుగా ఉమా శ్రీనివాస్, రావిరాల సంధ్యారాణి, వర్ణలీల, ఉపాధ్యక్షురాలిగా సంతోషి, ప్రధాన కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా పూర్ణిమ ప్రమాణ స్వీకారం చేశారు.